ప్రజాశక్తి
ఆదివారం 10 డిసెంబర్ 2023 5
శ్రీ సత్యసాయి

భూ స్వాధీన పోరాటంలో పాల్గొన్న పేదలు, సిపిఎం నాయకులు

రఘువీరా పయనమెటు..!

◆ కళ్యాణదుర్గంలో పోటీ చేయాలని కార్యకర్తల పట్టు ◆ అధిష్టానం నిర్ణయం మేరకేనని ప్రకటన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మాజీ మంత్రి రఘువీరారెడ్డి రాజకీయ పయనమెటు అన్నది చర్చ నడుస్తోంది. అటు తెలంగాణ, ఇటు కర్నాటక రెండు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ పార్టీ గెలుపొందింది. దీంతో ఇక్కడి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లోనూ ఉత్సహం నెలకొంది. ఈ నేపథ్యంలోనే సిడబ్లుసి సభ్యులుగానున్న ఎన్.రఘువీరారెడ్డి శుక్రవారం నాడు మడకశిర నుంచి కళ్యాణదుర్గ వరకు బైకు ర్యాలీని నిర్వహించారు. ఈ సమయంలో ఆయన ఇక్కడి నుంచి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయాలని ఆయన అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఇంట్లోకి వెళ్లకుండా బైటాయించారు. అయితే దీనిపై ఆయన ఎటువంటి సమాధానం చెప్పలేదు. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకే నడుచుకుంటామని ప్రకటించారు. ఆయనకు కళ్యాణదుర్గంలో మంచి పట్టుంది. 2009కి ముందు వరకు ఆయన మడకశిర నియోజకవర్గం నుంచి పోటీ చేసేవారు. 2009 సంవత్సరంలో నియోజకవర్గాల పునర్విభజన తరువాత మడకశిర ఎస్సీకి రిజర్వు అయ్యింది. దీంతో ఆయన నియోజకవర్గాన్ని కళ్యాణదుర్గంకు మార్చుకున్నారు. 2009లో తొలిసారిగా కళ్యాణదుర్గం నుంచి పోటీ చేశారు. ఆ సమయంలో ఆయన చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ద్వారా చెరగని ముద్ర వేశారు. ప్రజల్లోనూ మంచి ఆదరణ పొందారు. 2014 ఎన్నికలొచ్చే సరికి రాష్ట్ర విభజన జరగడంతో కాంగ్రెస్ పూర్తిగా గల్లంతైంది. ఆ ఎన్నికల్లో ఆయన ఇక్కడి నుంచి కాకుండా పెనుకొండ నుంచి పోటీ చేశారు. అక్కడ ఓట్లు వచ్చినా ఓటమి తప్పలేదు. ఆ తరువాత 2019లో కళ్యాణదుర్గం నుంచే కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేశారు. మెరుగైన ఓట్లే వచ్చినప్పటికీ ఓటమిని మాత్రం చవిచూడక తప్పలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి కూడా ఆశించినంత లేకపోవడంతో పిసిసి పగ్గాలను వదిలేసి రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు. ఇటీవల జరిగిన కర్నాటక ఎన్నికల సమయం నుంచి తిరిగి రాజకీయాల వైపు దృష్టి సారించారు. కర్నాటక ఎన్నికల్లో పావగడ ప్రాంతంలో ప్రచార బాధ్యతలను నిర్వహించారు. అక్కడ పార్టీ గెలుపునకు కృషి చేశారు. దీంతో ఆయన కర్నాటక రాజకీయాల వైపు దృష్టి పెట్టారన్న ప్రచారం సాగుతూ వస్తోంది. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో తుంకూరు నుంచి పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేసే అవకాశాలున్నాయన్న ప్రచారం కూడా సాగుతోంది. దీనిపై అధికార ప్రకటనేది చేయలేదు. తెలంగాణ ఎన్నికల్లోనూ పార్టీ విజయం సాధించాక ఆయన బైకు ర్యాలీని మడకశిర నుంచి కళ్యాణదుర్గంకు చేపట్టారు. ఈ సమయంలో అభిమానులు వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని ఒత్తిడి చేయడం చర్చనీయాంశమవుతోంది. మరోమారు అసెంబ్లీ బరిలోకి ఇక్కడి నుంచే దిగుతారా అన్నది చర్చ నడుస్తోంది. మరోవైపు విజయావకాశాలు మొండుగానున్న కర్నాటకలో పార్లమెంటుకు పోతారా అన్న మీమాంశ ఉంది. ఆయన మాత్రం అధిష్టనం నిర్ణయం మేరకు నడుచుకుంటానని చెప్పారు. ఏదిఏమైనా 2019 ఎన్నికల నుంచి రాజకీయాలకు దూరంగానున్న ఆయన వచ్చే సార్వత్రిక ఎన్నికల సమయంలో మాత్రం ఏదోక చోటు నుంచి తిరిగి రంగ ప్రవేశం చేస్తారన్న సంకేతాలు మాత్రం వెలువడతూ ఉన్నాయి.

ఇళ్ల పట్టాల పోరాటం ఉధృతం

◆ పాలసముద్రంలో భూస్వాధీన ఉద్యమాన్ని కొనసాగించిన సిపిఎం
◆ అరెస్టులు చేస్తామంటూ సిఐ బెదిరింపులు, వ్యక్తిగత దూషణ

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

మండలంలోని పాలసముద్రం గ్రామంలో పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటం ఉధృతం అయ్యింది. పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేంత వరకు భూస్వాధీన పోరాటం ఆపేది లేదని సిపిఎం నాయకులు స్పష్టం చేశారు. ఇళ్ల స్థలాల కోసం గత వారం రోజులుగా పేదలు ఆ స్థలంలోనే నివాసం ఉంటున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శనివారం ఉదయం రెవెన్యూ, పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకుని స్థలాన్ని ఖాళీ చేయాలని సూచించారు. లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని బెదిరించారు. అక్కడే ఉన్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దన్న, వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ఫిరంగి ప్రవీణ్‌కుమార్‌లు అధికారుల తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు స్థలాలు ఇవ్వమంటే కేసులు పెడతామని బెదిరించడం సరికాదన్నారు. మూడు రోజుల్లో ఇళ్ల పట్టాల సమస్యను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చిన అధికారులు ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పేదలను స్థలాల నుంచి ఖాళీ చేయించడంపై ఉన్న శ్రద్ధ పట్టాలు ఇవ్వడంపై అధికారులకు లేదన్నారు.

సిపిఎం నాయకులపై సిఐ దూషణలు

పేదల పక్షాన ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులపై గోరంట్ల సిఐ సుబ్బరాయుడు వ్యక్తిగత దూషణలకు దిగారు. స్థలం ఖాళీ చేయకపోతే కేసులు పెడతానంటూ బెదిరింపులకు దిగారు. దీనికి బెదరకుండా సిపిఎం నాయకులు పేదల పక్షాన నిలబడి పోరాటం సాగించారు. పోలీసులు పెద్దన్నతో పాటు మరికొందరు సిపిఎం నాయకులను అరెస్టు చేసేందుకు ప్రయత్నించారు. దీనిని పేదలు అడ్డుకున్నారు. ఈ సమయంలో కూడా సిఐ పరుషపదజాలంతో సిపిఎం నాయకులపై దూషణలకు దిగారు. సిఐ తీరును నాయకులు ఖండించారు. ఈ సందర్భంగా పెద్దన్న మాట్లాడుతూ తాము పేదల పక్షాన పోరాటం చేస్తున్నామన్నారు. తమను సిఐ వ్యక్తిగతంగా దూషించడమే కాకుండా, అరెస్టులు చేస్తామని బెదిరింపులకు దిగడం దుర్మార్గంగా ఉందన్నారు. చేతనైతే పేదలకు పట్టాలు ఇప్పించి సహకరించాలి గానీ, ఇలా బెదిరింపులకు దిగడం సరికాదంటూ సిఐకు హితవు పలికారు. ఇలాంటి బెదిరింపులకు బెదరమని పట్టాలు ఇచ్చేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్రాముడు, నారాయణ, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశులు, సిపిఎం మండల నాయకులు కొండా వెంకటేశులు , కళ్లు రామకష్ణప్ప, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు వజీర్, లక్ష్మీనారాయణ, నారాయణ, అంజలి, వెంకట లక్ష్మమ్మ, లక్ష్మీదేవమ్మ, రామలక్ష్మమ్మతో పాటు పేదలు పాల్గొన్నారు.

విన్నర్స్, రన్నర్స్ మెమంటో అందిస్తున్న ప్రిన్సిపల్ నారాయణరెడ్డి

నైపుణ్యంతో కూడిన విద్యను నేర్చుకోవాలి

ఫ్రెషర్స్ డేలో ప్రిన్సిపల్ నారాయణరెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు నైపుణ్యంతో కూడిన విద్యను నేర్చుకుంటే ప్రపంచంలో ఎక్కడైనా రాణించవచ్చునని సప్తగిరి ఎంబిఎ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి అన్నారు. సప్తగిరి ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రతి సంవత్సరం విద్యార్థులకు స్వాగతోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ నారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా దివ్య ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు వేణుగోపాల్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకుని ఆ లక్ష్య సాధన కోసం పట్టుదలతో శ్రమించాలన్నారు. నైపుణ్యంతో విద్యను నేర్చుకుంటే ప్రపంచంలో ఎక్కడైనా జీవించవచ్చున్నారు. అనంతరం బిజినెస్ ఈవెంట్స్‌లో విన్నెర్స్, రన్నెర్స్‌కు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి విద్యాసంస్థల ఏవో గంగిరెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శివశంకర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డులేని రాగానిపల్లితండా

ప్రజాశక్తి-నల్లమాడ

మండల పరిధిలోని గోపేపల్లి పంచాయతీ రాగానిపల్లితండకు సరైన రోడ్డు సదపాయం లేక తండావాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ దాదాపు 50 కుటుంబాల ప్రజలు జీవనం సాగిస్తున్నారు. సరైన రోడ్డు లేకపోవడంతో వాహనాల రాకపోకలు చేసేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అనారోగ్యం సమయంలో ఆసుపత్రికి తీసుకెళ్లాలన్నా అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేదు. మూడు కిలోమీటర్లు కాలినడకన వెళ్తేగానీ ప్రయాణం చేసేందుకు వీల్లేని పరిస్థితి ఉంది. విద్యార్థులు సైతం ప్రతి రోజు రానుపోను 6 కిలోమీటర్లు నడిచి పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఓట్ల సమయంలో వచ్చే నాయకులు రోడ్డు వేస్తామని మాట ఇవ్వడం తరువాత మర్చిపోవడం పరిపాటిగా మారింది. ఈ తండాలో నేడు ఆదివారం నాడు గడపగడపకూ మన ప్రభుత్వం జరగనున్న నేపథ్యంలో రోడ్డు సమస్యపై తండా వాసులు అధికారులు, ప్రజాప్రతినిధులను ప్రశ్నించేందుకు సిద్ధం అవుతున్నారు.

14,15న కలెక్టరేట్ ముట్టడి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 14,15వ తేదీల్లో కలెక్టరేట్‌ను ముట్టడిస్తున్నట్లు ఆశ వర్కర్లు తెలిపారు. శనివారం ప్రశాంతి గ్రామంలోని పుట్టపర్తి వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పిఒడిటి కృష్ణయ్యకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సిఐటియు నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల జిల్లా గౌరవాధ్యక్షుడు సాంబశివ మాట్లాడుతూ ఈనెల 14, 15వ తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి, ధర్నా, వంటావార్పు కార్యక్రమంతో నిరసన తెలియజేస్తున్నామని చెప్పారు. ఆశ వర్కర్లకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందకుండా ఆపేయడం దుర్మార్గంగా ఉందన్నారు. ఆశాలకు రిటైర్మెంట్ సమయంలో ఎలాంటి ప్రోత్సాహకాలూ ఇవ్వడం లేదన్నారు. ఇలా అయితే వద్ధాప్యంలో వారి జీవనం ఎలా గడపాలని ప్రశ్నించారు. సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన ఈ ముట్టడి కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా ఉన్న ఆశాలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి సౌభాగ్య, ఉపాధ్యక్షులు మంజుల, సహాయ కార్యదర్శి కళావతి, చెన్నకృష్ణమ్మ గాయత్రి, సిద్దు పాల్గొన్నారు.

వినతపత్రం అందజేస్తున్న ఆశా యూనియన్ నాయకులు

అంకితభావంతో న్యాయవాద వృత్తిలో రాణించాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు

ప్రజాశక్తి-హిందూపురం

న్యాయవాదులు క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావంతో పనిచేస్తేనే వత్తిలో రాణించేందుకు అవకాశం ఉంటుందని హైకోర్టు న్యాయమూర్తి, అనంతపురం ఉమ్మడి జిల్లాల పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు పేర్కొన్నారు. స్థానిక బార్‌అసోసియేషన్ ఆహ్వానం మేరకు శనివారం కోర్టు ఆవరణాన్ని ఆయన పరిశీలించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మన్మథరావు మాట్లాడుతూ న్యాయవాద వత్తి ఎంతో కఠినమైందన్నారు. నైపుణ్యత, పట్టుదలతో ముందుకెళితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు అన్నారు. జూనియర్ న్యాయవాదులు వత్తి పట్ల అంకితభావంతో ఉండి, తగిన మెలకువలను సీనియర్ల నుంచి తెలుసుకోవాలన్నారు. ఇందులో భాగంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, సీనియర్ న్యాయవాదులు నాగభూషణరావు, రామచంద్రారెడ్డి, సుదర్శన్, సిద్దు తదితరులు స్థానిక కోర్టులో నెలకొన్న సమస్యలపై పరిపాలన న్యాయమూర్తికి వినతిపత్రం ద్వారా తెలియజేశారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మన్మథరావును సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి, హైకోర్టు ఎజిపి అశ్వర్థ నారాయణ, స్థానిక ఏపీపీల ఇందాద్, నగేష్, సుహాసిని, ఏజీపీ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి మన్మథరావు

న్యాయమూర్తికి స్వాగతం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి మన్మథరావు పర్యటనలో భాగంగా హిందూపురం పట్టణానికి రావడంతో జిల్లా ఎస్పి మాధవరెడ్డి పోలీసు శాఖ తరపున ఆయనకు పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ, సిఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ

ఉద్యోగాల ప్రకటన మరో మోసం ..!

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ

ప్రజాశక్తి -పెనుకొండ

ఎన్నికల ముందర ఉద్యోగాల పేరుతో నోటిఫికేషన్లు విడుదల చేయడం నిరుద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం మరోసారి మోసం చేయడమేనని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ విమర్శించారు. శనివారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఇంతకాలం ఎందుకు ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయలేదని ప్రశ్నించారు. ప్రతి ఎటా జనవరిలో లక్ష ఉద్యోగాలన్న జగన్మోహన్‌రెడ్డి ఇప్పటికి ఎన్ని ఇచ్చారని ప్రశ్నించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే జగన్మోహన్‌రెడ్డి నోటిఫికేషన్ల డ్రామాలు ఆడుతున్నారని దుయ్యాబట్టారు. పరీక్షలకు సన్నద్ధం అయ్యే సమయం కూడా ఇవ్వకుండా ఫిబ్రవరిలో పరీక్షలు నిర్వహించడం వెనుక జగన్ ఆంతర్యాన్ని నిరుద్యోగులు గుర్తించాలన్నారు. కేవలం ఇది ఎన్నికలకోసం తప్పా మరొకటి కాదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు డీవీ.ఆంజనేయులు, గుట్టూరు మాజీ సర్పంచి సూర్యనారాయణ, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఆంజనేయులు, మాజీ ఎంపీపీ నరసింహులు, మాజీ మాజీ ఎంపిటీసీ రమణమ్మ, చెన్నకేశవులు, శ్రీనాథ్ చౌదరి క్రిష్టప్ప, తిరుపాల్ నాయడు, కొనాపురం సుబ్బు, మాజీ వైస్ సర్పంచి సుబ్రహ్మణ్యం, బాబుల్ రెడ్డి, పురుషోత్తం నాయుడు, బాబు, మల్లికార్జున, వెంకటేష్, ముత్యాలు, రాము, మంజు, ప్రశాంత్, భార్గవ, భాస్కర రెడ్డి పాల్గొన్నారు.

'గడపగడపకూ'తో సమస్యల పరిష్కారం : ఎమ్మెల్యే

ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శనివారం కొత్తచెరువు మండలం బైరాపురం సచివాలయ పరిధిలోని గౌనికుంటపల్లి బైరాపురం, ఓబులదేవరపల్లి, సాయినగర్, గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామంలోని సమస్యలను ఎమ్మెల్యే దష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ మండలి ఛైర్మన్ ఆవుటల రమణారెడ్డి కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, జెడ్పిటిసి గంగాదేవి శంకర్, ఎంపిటిసిలు రాజు ,సూర్యనారాయణ రఫీ, సింగల్ విండో అధ్యక్షులు తిప్పారెడ్డి, మాజీ అధ్యక్షుడు రామచంద్ర, మాజీ సర్పంచి జనార్ధన్‌రెడ్డి, పుట్టపర్తి ఎంపీపీ ఎవి.రమణారెడ్డి, తహశీల్దార్ రామాంజనేయరెడ్డి, ఎంపిడిఒ సిద్ధారెడ్డి, హౌసింగ్ ఏఈ రమణారెడ్డి, ఏవో నటరాజ్, జెఈ లక్ష్మన్న పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పల్లె పరామర్శ

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మున్సిపాల్టీ పరిధిలోని పెద్దకమ్మవారిపల్లెలో శనివారం నాడు అమ్మినేని శారదమ్మ మతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పరామర్శించారు. పుట్టపర్తి పట్టణంలోని కుమ్మరిపేటలో నివసించే మైనార్టీ సెల్ నాయకుడు చిన్న కుల్లాయప్ప తల్లి ఫాతిమా మరణ వార్త తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మతురాలు కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్తున్న విద్యార్థులను అభినందిస్తున్న యోగా శిక్షకులు

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ధర్మవరం విద్యార్థులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

అనంతపురంలోని వివేకానంద భవనంలో సెప్టెంబరు 24న జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో ధర్మవరానికి చెందిన 19మంది విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ధర్మవరం యోగా అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల సోమేశ్వరరెడ్డి తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 10,11,12 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే విద్యార్థులు శనివారం నాడు ధర్మవరం రైల్వేస్టేష నుంచి గుంటూరుకు బయలుదేరి వెళ్లారు. వీరికి యోగా అసోషియేషన్ ఉపాధ్యక్షులు కరెంట్ ఆది, తిరుమలేశ్, సెక్రటరీ సుబ్బరాయుడు, జాయింట్ సెక్రటరీ ఈశ్వరయ్య, ఆర్గనైజర్ నరసింహులు, యోగా మాస్టర్లు మల్లేశ్, ప్రభావతిలు శుభాకాంక్షలు తెలియజేశారు.

అన్నదానానికి ఆర్థికసాయం

ముదిగుబ్బ : అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని సామాజికవేత్త గడ్డం రాజగోపాల్ తెలిపారు. అయ్యమాలధారుల అన్నదానం కోసం శనివారం ఆయన రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. మలకవేముల క్రాస్‌లోని ఆయన స్వగహంలో మలకవేముల క్రాస్‌లోని అయ్యప్ప స్వామి మాలధారుల కోసం ఈ సాయాన్ని అందించారు.

దొంగ ఓట్ల డ్రామాలు ఆపు..!

ప్రకాష్‌రెడ్డిపై పరిటాల సునీత ఫైర్

ప్రజాశక్తి-కనగానపల్లి



బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న మాజీ మంత్రి పరిటాల సునీత

దొంగ ఓట్ల విషయంలో ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి చేస్తున్న డ్రామాలు ఆపాలని మాజీ మంత్రి పరిటాల సునీత తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని కనగానపల్లి మండల కేంద్రంలో శనివారం 3వ రోజు కొనసాగించారు. ప్రతి ఇంటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. సూపర్ సిక్స్ పథకాల లబ్ధి గురించి తెలియజేశారు. ఇదే సమయంలో ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ వారివి డబల్ ఓట్లు ఉన్నాయంటూ ఆయన చేస్తున్న ఆరోపణల మీద స్పందించారు. తాను గతంలో చెప్పిన విధంగానే డబుల్, దొంగ ఓట్ల మీద విచారణ ఎమ్మెల్యే సొంత గ్రామం, ఆయన ఇంటి నుంచే ప్రారంభిద్దామని మరోసారి సవాల్ విసిరారు. దీనిపై స్పందించకుండా ఆయన రోజుకో కొత్తరకం నాటకం తెరపైకి తెస్తున్నారన్నారు. వైసిపి నాయకులు బిఎల్వోల ద్వారా టిడిపి సానుభూతిపరుల ఓట్లు ఇష్టానుసారంగా తొలగిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే సొంతగ్రామం తోపుదుర్తిలో 380 ఓట్లు వేరే ప్రాంతం వారివి ఉన్నాయన్నారు. ఆయన ఇంట్లోనే కుటుంబ సభ్యుల మీద రెండేసి ఓట్లు ఉన్నాయన్నారు. ఎమ్మెల్యేకి చిత్తశుద్ధి ఉంటే వీటిపై విచారణకు సిద్ధం అవ్వాలన్నారు. దొంగ ఓట్లు ఉంటే ఏ పార్టీ వారివైనా తొలగించాల్సిందేనని ఆమె స్పష్టం చేశారు. దొంగ ఓట్లపై పూర్తి వివరాలను త్వరలోనే ప్రజలకు వెల్లడిస్తామన్నారు.

13న కలెక్టరేట్‌లో ఆహార సలహా మండలి సమావేశం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా ఆహార సలహా మండలి సమావేశాన్ని ఈనెల 13న కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు సివిల్ సప్లయ్ డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు తెలిపారు. సమావేశంలో చౌక దుకాణాల పనితీరు పంపిణీ విధానం తదితర అంశాలపై చర్చ ఉంటుందన్నారు. విజిలెన్స్ కమిటీలో ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు జిల్లాలోని ముఖ్య అధికారులు సభ్యులు పాల్గొంటారన్నారు.

తెలుగుదేశం పార్టీతోనే బీసీలకు న్యాయం

రాష్ట్ర కుంచిటీగా వక్కలిగా సాధికార సమితి అధ్యక్షులు పాండురంగప్ప

ప్రజాశక్తి-మడకశిర

తెలుగుదేశం పార్టీలోనే బీసీలకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర కుంచిటీగా వక్కలిగా సాధికారిక అధ్యక్షులు వీఎం.పాండురంగప్ప తెలిపారు. శనివారం నియోజకవర్గం పరిధిలోని ఆగళి మండలం హల్లికెర గ్రామంలో టిడిపి సీనియర్ నాయకులు సంపత్‌కుమార్ నివాసంలో బీసీల పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కుంచిటిగా వక్కలిగా సాధికార సమితి అధ్యక్షులు వియ.పాండురంగప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు న్యాయం జరగాలంటే టిడిపి అధికారంలోకి రావాలన్నారు. నాలుగున్నర సంవత్సర కాలంలో వైసిపి బిసిలకు అన్ని విధాలా అన్యాయం చేసిందన్నారు. విధులు, నిధులు లేని కార్పొరేషన్లను ఏర్పాటు చేసి చేతులు దులుపుకుందన్నారు. ఇలాంటి పార్టీకి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగల్ విండో డైరెక్టర్ రామన్న, గంగాధర్, శివారెడ్డి, సీనియర్ నాయకుడు ముకుందప్ప, రామన్న, తిప్పేస్వామి, రంగనాథప్ప, శివన్న, నాగరాజ్, వార్డ్ మెంబర్ నాగరాజ్, దొడ్డ భీరప్ప, కాంతరాజ్, జయన్న, హరీష్ ,జగదీష్ గౌడ్ ,వీరన్న ,లక్ష్మమ్మ, చెరువు ఆ యొక్కట్టు అధ్యక్షులు గాయత్రమ్మ, లక్ష్మమ్మ, నేత్రమ్మ, నాగేంద్రప్ప, కట్టప్ప, లింగరాజు, పంచాయతీ మాజీ అధ్యక్షులు రంగనాథ్, నాగరాజు, వి.శేఖర్, లక్ష్మమ్మ, అనితమ్మ, శారదమ్మ, పద్మావతి, తిప్పేస్వామి, మాలింగప్ప, చంద్రప్ప, దేవరాజు, లింగప్ప పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కుంచిటీగా ఒక్కలిగా సాధికార సమితి అధ్యక్షులు పాండురంగప్ప

ప్రజాశక్తి
www.prajasakti.com

సర్పంచుల అధికారాలను తుంగలో తొక్కిన వైసిపి

సర్పంచుల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్

మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు గోనుగుంట్ల భూషణ్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

సర్పంచుల అధికారాలను వైసిపి ప్రభుత్వం తుంగలోకితొక్కిందని ఉమ్మడి అనంత జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షుడు వై.వి.రాజేంద్రప్రసాద్, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వానపల్లి లక్ష్మీముత్యాలరావుల ఆదేశాలతో శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోనుగుంట్ల భూషణ్ మాట్లాడుతూ వైసిపి పాలనలో గ్రామాల అభివృద్ధికి దూరంగా మిగిలాయన్నారు. డ్రైనేజీలు సరిగాలేవన్నారు. గుంతల మయమైన రోడ్లతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీధిలైట్లు లేక గ్రామాలు అంధకారంలో ఉన్నాయన్నారు. 14,15వ ఆర్థిక సంఘం నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం లాగేసుకుందన్నారు. సర్పంచుల అధికారాలను నాశనం చేస్తున్న వైసిపి తన విధానాలను మార్చుకోవాలన్నారు. లేకుంటే సర్పంచుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ సభ్యుడు ఇస్మాయిల్, ఉమ్మడిజిల్లా సర్పంచుల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ ముత్యాలప్ప, నియోజకవర్గ కన్వీనర్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ మద్దిలేటి, నాయకులు నాగూరహుస్సేన్, రామాంజినేయులు పాల్గొన్నారు.

పొలాల వద్ద వరుస దొంగతనాలు

మోటార్ల కేబుల్ వైర్లు చోరీ

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

మండలంలోని పలు గ్రామాల్లో రైతుల వ్యవసాయ బోరు బావుల వద్ద కేబుల్ వైర్లను దొంగలు ఎత్తుకెళ్తున్నారు. వరుసగా జరుగుతున్న ఈ చోరీలతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మండల పరిధిలోని మరకుంటపల్లి, పోతలకుంట, పాతదేవరపల్లి, కొత్తదేవరపల్లి గ్రామాల్లో వ్యవసాయ మోటార్లకు అమర్చిన విద్యుత్ కేబుల్ వైర్లను ఇటీవల ఎత్తుకెళ్లారు. శుక్రవారం రాత్రి మరకుంటపల్లి, పోతలకుంట, గ్రామాలకు చెందిన సుమారు 20 మంది రైతులకు చెందిన కేబుల్ వైర్లను దొంగలు ఎత్తుకెళ్లారు. రైతులు సంజప్ప, మారుతి, నారాయణస్వామి, రామిరెడ్డి, మనోహర్ తదితర రైతులకు చెందిన కేబుల్వైర్లను ఎత్తుకెళ్లారు. ఈ దొంగతనాలపై గతంలో పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రయోజనం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఓ దొంగను పోలీసులు పట్టించినా నామమాత్రపు విచారణ చేసి వదిలిపెట్టారు. పోలీసులు ఈ దొంగతనాలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి నివారించాలని రైతులు కోరుతున్నారు.

టిడిపితో భవిష్యత్‌కు గ్యారెంటీ : శ్రీరామ్

ప్రజాశక్తి బత్తలపల్లి

శ్రీరామ్‌ను గజమాలతో సత్కరిస్తున్న టిడిపి అభిమానులు

టిడిపితోనే భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని, వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ టిడిపిని ఆదరించాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని గంటాపురం గ్రామంలో బాబు ష్యూరిటీ -భవిష్యత్ కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. టిడిపి అధికారంలో వస్తే చేపట్టబోయే ఆర పథకాల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రజలంతా విసిగిపోయారన్నారు. ఎక్కడ చూసినా ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్నారన్నారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు ఇలా అంతా ఈ ప్రభుత్వ బాధితులుగా మారారన్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిన వైసిపిని సాగనంపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోనుగుంట్ల విజయకుమార్, మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, అప్పలస్వామి, అలియాస్ గంటాపురం జగ్గు, సతీష్ నాయుడు, జక్కంపూటి నాగభూషణం, బోయపాటి అప్పస్వామి, నెట్టెం అశోక్ నాయుడు, హరి పాల్గొన్నారు.

బాధితునికి ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఆర్థికసాయం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల

శాంతినగర్‌లోని మైనారిటీ వర్గానికి చెందిన ఇలియాజ్‌కు ఇటీవల వైసీపీ నాయకులు బాకీ డబ్బులు ఇవ్వలేదని బెదిరించడంతో ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయ్యి ఇంటి వద్ద ఉన్న ఆయనను మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఆదేశాల మేరకు ఆయన అనుచరులు పరామర్శించి రూ.20వేల ఆర్థికసాయం అందించారు. బిజెపి పట్టణ అధ్యక్షులు డిష్ రాజు ఆధ్వర్యంలో ఈ సాయాన్ని అందించారు. ప్రజలపై బెదిరింపులకు పాల్పడుతున్న వైసిపికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రాప్తాటి రాము, దుస్సొక్కస్త, గోట్లుర చంద్ర, నారాయణస్వామి యాదవ్, బోడీగం గిరిధర్, నబీరసూల్, లాయర్ దస్తగిరి, చింతా జగదీష్, పండగ హరి, సిద్ధయ్య గుట్ట హరి, చిదంబరయ్య తదితరులు పాల్గొన్నారు.

గూనిపల్లిలో ఉచిత వైద్యశిబిరం

బుక్కపట్నం : మండల పరిధిలోని గూనిపల్లి గ్రామంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పీస్ వెల్ఫేర్ సొసైటీ వారి ఆధ్వర్యంలో తాళ్లపల్లి భయారెడ్డి సహకారంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరానికి కావేరి హాస్పటల్ బెంగళూరు వైద్య బృందం పాల్గొని దాదాపు 200 మందికి గుండె జబ్బులు, ఎముకల సంబంధిత వ్యాధులు, మధుమేహం రక్త పరీక్షలు, ఈసీజీ, ఎకో, కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ల బృందం రాజా, ప్రశాంత్ కుమార్, సౌజన్య, రెడ్ క్రాస్ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్, కమిటీ మెంబర్స్ భయ్యా రెడ్డి, కోఆర్డినేటర్ రమేష్ పాల్గొన్నారు.

టిడిపి హయాంలోనే బీసీల అభివృద్ధి

బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న టిడిపి నాయకులు

మడకశిర : తెలుగుదేశం పార్టీ హయాంలోనే బీసీల అభివృద్ధి జరిగిందని నాయీబ్రాహ్మణ సాధికార జిల్లా కన్వీనర్ రామాంజనేయులు తెలిపారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని గుడిబండ మండలం బూదిపల్లి గ్రామంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ హయాంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బీసీల కోసం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో బూదిపల్లి జయరాములు, నాయీబ్రాహ్మణ సత్యసాయి జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, మాజీ ఎంపీటీసీ వెంకటేష్, బూత్ కన్వీనర్ నాగేంద్ర, కన్వీనర్ గోపాల్ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

హిందూపురం : పట్టణంలోని ట్రినిటీ ఆర్గనైజేషన్, బెంగళూరుకు చెందిన శంకర్ నేంత్రాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన కంటివైద్య శిబిరానికి స్పందన లభించింది. పట్టణంలోని సిఅండ్ఐ మిషన్ చర్చి ఆవరణంలో శనివారం ఏర్పాటు చేసిన 103వ ఉచిత కంటి వైద్య శిబిరంలో వైద్యులు కంటి పరీక్షలు చేశారు. శస్త్రచికిత్స కోసం పలువురిని బెంగళూరుకు తరలిచారు. గత నెల శస్త్రచికిత్స చేయించుకున్న వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఅండ్ఐజి మిషన్ చర్చి అధ్యక్ష, కార్యదర్శులు అనిల్ కుమార్, పాల్, ట్రినిటీ ఆర్గనైజేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కుమార్ రాజా, ఉషారాణి, కంటి వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనిక, క్యాంపు ఇన్‌ఛార్జి శివప్రసాద్, రహంతుల్లా పాల్గొన్నారు.

అన్నదాతపై తుఫాన్ దెబ్బ

బత్తలపల్లి : మండలంలో తుఫాన్ దెబ్బ రైతులపై పడింది. శనివారం తెల్లవారుజామున కురిసిన వర్షం, ఈదురు గాలులు పంటలపై ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుతం వరి పంట చేతికి రాగా రైతులు పంటను యంత్రాల సహాయంతో కోతలు కోసి అరబెట్టుకున్నారు. ఈ పరిస్థితుల్లో వర్షం కురవడంతో రైతులు ధ్యానం తడిసిపోకుండా ప్లాస్టిక్ పట్టలతో కప్పుతూ పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. మండలంలోని గరికలపల్లి, ఉప్పరపల్లి, దంపెట్ల, నల్లబోయనపల్లి, ఓబుళాపురం, రామాపురం, జలాలపురం తదితర గ్రామాల్లో వరి పంట ఈదురు గాలుల ధాటికి నేలకొరిగింది. దీంతో రైతులు వరి పంటకు కట్టలు కట్టే పనిలో పడ్డారు.

కొనసాగుతున్న ఇళ్ల కూల్చివేతలు

నష్టపరిహారం ఇచ్చినవారివే తొలగిస్తున్నాం : అధికారులు

ఇళ్లను ఖాళీచేసి సామగ్రిని తీసుకెళ్తున్న బాధితులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం పట్టణం కదిరిగేటు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం ఇళ్ల తొలగింపు కార్యక్రమం కొనసాగుతోంది. శుక్రవారం నాడు ప్రారంభం అయిన ఈ కార్యక్రమం శనివారం కొనసాగింది. ఇదివరకే బాధితుల ఖాతాలో డబ్బులు జమైన వారి ఇళ్లను ఆర్అండ్‌బి అధికారులు గుర్తించి పోలీసు బందోబస్తు మధ్య తొలగిస్తున్నారు. పట్టణ సిఐలు సుబ్రమణ్యం, అశోక్ కుమార్‌ల ఆధ్వర్యంలో గట్టిబందోబస్తు మధ్య ఈ తొలగింపుల కార్యక్రమం జరుగుతోంది. కొందరు స్వయంగా ఇళ్లను ఖాళీ చేసి మరొక చోటికి వెళ్తున్నారు. నష్టపరిహారం అందని వారు మాత్రం ఈ తొలగింపులను అడ్డుకుంటున్నారు. పరిహారం ఇవ్వకుండా ఇళ్ల తొలగింపు ఎలా చేస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. అధికారులు మాత్రం పరిహారం అందిన ఇళ్లనే ప్రస్తుతం కూల్చివేస్తున్నామని చెబుతున్నారు.

కదిరిలో అగ్రిగోల్డ్ బాధితుల సత్యాగ్రహ దీక్ష

ప్రజాశక్తి-కదిరి టౌన్

అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోషియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కదిరి నియోజకవర్గ అగ్రిగోల్డ్ బాధితులు శనివారం నాడు మున్సిపల్ కార్యాలయం ముందు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. నియోజకవర్గ అధ్యక్షులు హాజీ అత్తార్ మహబూబ్ బాషా చేపట్టిన ఈ కార్యక్రమంలో ఫక్రుద్దీన్, ఉత్తన్న, ఆనంద బాబు, సత్యనారాయణ, ఖాదర్ ఖాన్, పులివెందుల బాలాంజనేయులు, వెంకటేశ్, గాండ్లపెంట షేక్ షమీవుల్లా, మహమ్మదలీ, హిదాయత్, నౌషాద్, మునీర్, ఇస్మాయిల్, గాండ్లపెంట రఫీ, మలకవేమల శివయ్య, కలిచెర్ల మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు. అగ్రిగోల్డ్ బాధితులందరికీ న్యాయం చేయాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు. వీరి దీక్షలకు కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ కార్యదర్శి షానవాజ్, టౌన్ కార్యదర్శి అష్రఫ్, జిల్లా జనరల్ కార్యదర్శి నాగభూషణ సమన్వయ కార్యకర్తలు మునికుమార్, కదిరప్ప, షౌకత్ అలీ ఖాన్, ఇర్ఫాన్, తెలుగుదేశం పార్టీ కదిరి టౌన్ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, తెలుగు యువత ఉపాధ్యక్షులు షాకీరుల్లా ఖాన్, మైనార్టీ నాయకులు బాబ్జాన్, మస్తాన్, మన్సూర్, మాజీ కౌన్సిలర్ హనుమంతు తదితరులు మద్దతు తెలిపారు.

సత్వర న్యాయంతో ప్రయోజనం

లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు శ్రీధర్, రాజ్యలక్ష్మి

కక్ష దారులకు పత్రాన్ని అందజేస్తున్న న్యాయమూర్తులు శ్రీధర్, రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి-హిందూపురం

కోర్టుల ద్వారా సత్వర న్యాయం పొందడం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, జూనియర్ సివిల్ జడ్జ్ రాజ్యలక్ష్మి తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ మెగా లోక్‌అదాలత్ నిర్వహించి వివిధ రకాల 355 కేసులను అక్కడికక్కడే కక్ష దారులతో చర్చించి పరిష్కరించారు ,ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవడం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. చిన్నపాటి వివాదాలు, ఘర్షణలకు పోలీస్ స్టేషన్‌ల, కోర్టుల చుట్టూ తిరిగి కాలాన్ని,డబ్బును, శ్రమను, వధా చేసుకోవద్దని తెలిపారు. కక్షిదారుల సౌకర్యార్థం ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మెగా లోక్ అదాలత్‌లో రాజీద్వారా కేసులను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీలు నగేష్, సుహాసిని, ఏజీపీ శ్రీనివాస్ రెడ్డి, లోకఅదాలత్ శారద, సభ్యులు పార్వతి న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పెనుకొండ : పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో శనివారం నాడు మెగా లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. లోక్ అదాలత్ ఛైర్మన్ ఎం.శంకర్‌రావు, జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పసపల సయ్యద్ అధ్యక్షతన ఈకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి శంకర్‌రావు మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం చేసుకుంటే సత్వర న్యాయం జరిగి కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. రాజీమార్గమే రాజమార్గమని తెలిపారు. కక్షిదారులు లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ భాస్కర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్‌తో జీవితాలు నాశనం

బత్తలపల్లి : ఫ్యాక్షన్ కక్షలతో జీవితాలు నాశనం అవుతాయని, వాటిని వదిలి ప్రశాంత జీవితాన్ని అలవర్చుకోవాలని ఎస్ఐ పి.శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం రాత్రి మండలంలోని అప్పరాచెరువు గ్రామంలో పల్లెనిద్ర చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్యాక్షన్ గొడవలను విడనాడితేనే అభివృద్ధి సాధ్యం అన్నారు. ప్రశాంతంగా జీవించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనుమానిత వ్యక్తులు గ్రామంలో సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

చెరువు కట్టపై చెట్లు తొలగింపు

కొత్తచెరువు : మండల కేంద్రంలో బుక్కపట్నం రోడ్డు నడిమికొండ నుంచి శివాలయం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల కంప చెట్లను టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో శనివారం తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా పెద్దగా చెట్లు పెరగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతన్నారు. ఈ నేపథ్యంలో ఆదినారాయణ స్పందించి చెట్లను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సయ్యద్‌బాషా, జెసిపి శ్రీనాథ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల అభివృద్ధి

మడకశిర : కాంగ్రెస్ పాలనలోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యం అవుతుందని మాజీ ఎమ్మెల్యే సుధాకర్ తెలిపారు. శనివారం మండలంలోని గంగలవాయిపాళ్యం నీలకంఠాపురం, నీలకంఠాపురం ఎస్సీ కాలనీ, గంగలవాయిపాళ్యం, బంద్రేపల్లి, బచ్చలయ్యపాళ్యం, కొలిమిపాళ్యం, ముద్దారెడ్డిపాళ్యం, సిద్దాపురం గ్రామాల్లో కాంగ్రెస్ ముందడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ మంత్రి, సిడబ్ల్యూసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి సతీమణి సునీత రఘువీర్‌ను కలిశారు. అనంతరం గ్రామాల్లో తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి గల ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కన్వీనర్ మంజునాథ్, పట్టణ కాంగ్రెస్ నాయకుడు బాబు, నాయకులు పాల్గొన్నారు.

కెంపెగౌడ జయంతి వేడుకలను జయప్రదం చేయండి

అమరాపురం : నేడు జరిగే కెంపెగౌడ, బనుమయ్య జయంతి వేడుకలను జయప్రదం చేయాలని ఒక్కలిగా సాధికార సమితి కమిటీ సభ్యులు కోరారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కెంపెగౌడ బనుమయ్య చిత్రపటాలకు పూజా కార్యక్రమం నిర్వహించిన అనంతరం మహిళలచే కుంభకళారాధనతో ప్రదర్శన, పురవీధులలో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కుంచిటి ఒక్కలిగా సాధికార సమితి సభ్యులు, వైకాపా మండల కన్వీనర్ త్రిలోక్నాథ్, హల్కూర్ కాంత్‌రాజు, మద్దనకుంట ఎంపిటిసి హనుమంతరాయ, గౌడ్నుకుంటా వీరకేతరాయప్ప, హల్కూరు సురేష్, నాగరాజు, గిరీష్, ఎంపీటీసీ నారాయణ గౌడ, మహేష్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం

హిందూపురం : వైఎస్.భారతి పుట్టిన రోజును పురస్కరించుకుని పట్టణంలోని బెంగళూరు రోడ్డులో ఉన్న అయ్యప్ప ఆలయంలో వైసిపి నాయకులు అయ్యప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆసిఫ్, సునీత వెంకటేష్ రెడ్డి, జిల్లా సెక్రటరీ లక్ష్మీనారాయణ, టౌన్ ఏ బ్లాక్ కన్వీనర్ సాదిక్, హిందూపురం మండల కన్వీనర్ రాము, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ రాచపల్లి మహేంద్రనాథ్ రెడ్డి, నాయకులు నక్కలపల్లి శ్రీరామిరెడ్డి, ఆర్‌కె.ఖలీల్, రాంమూర్తి, బేరింగ్ మస్తాన్, ద్వారకనాథ్ రెడ్డి, మలుగూరు శివన్న, కురుబ సుబ్బు, నందమూరినగర్ మోహన్, ధాదు, రమణ రెడ్డి, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ల్యాప్‌టాప్ అందజేత

పుట్టపర్తి అర్బన్ : చెన్నై నుంచి పుట్టపర్తికి వస్తున్న ఆర్టీసీ బస్సులో దొరికిన ల్యాప్‌టాప్‌తో పాటు కొంత నగదు, చేతి గడియారాలు బాధితులకి ఆర్టీసీ సిబ్బంది అందజేశారు. శనివారం చెన్నై నుంచి పుట్టపర్తికి వస్తున్న బస్సులో ప్రయాణించిన విజయ్ అనే ప్రయాణికుడు బస్సులో ల్యాప్‌టాప్, 200 నగదు, రెండు చేతి గడియారాలు బస్సులో మరిచిపోయాడు. పుట్టపర్తి డిపోకు వచ్చిన బస్సులో డ్రైవర్లు జిఆర్.బాబు, ఈవీఎస్.రెడ్డి వీటిని గుర్తించి డిపోలో డిసికి అందజేశారు. ప్రయాణికుడు విజయ్‌కి సమాచారం అందించి పోగొట్టుకున్న వస్తువులను ఆయనకు అందజేశారు. నిజాయితీగా వ్యవహరించిన ఆర్టీసీ డ్రైవర్లను పలువురు అభినందించారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షులుగా గంగాధర్

సోమందేపల్లి : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పిసిసి వైస్ ప్రెసిడెంట్ కెటి.శ్రీధర్ ఆధ్వర్యంలో శనివారం నాడు సేవామందిర్‌లో జరిగిన సమావేశంలో పెనుకొండ నియోజకవర్గంలోని మండలాలకు కాంగ్రెస్ అధ్యక్షులను నియమించారు. ఇందులో భాగంగా సోమందేపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా గంగాధర్‌ను నియమించినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీన, అణగరిన వర్గాలకు అవకాశం ఇచ్చి ఎందరినో రాజకీయ ఎదుగుదలకు తోడ్పాటు చేసిందన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు అందజేత

కదిరి అర్బన్ : ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి విడుదలైన రూ.7.95 లక్షల చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే డా॥సిద్ధారెడ్డి శనివారం ఆయన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సహాయ నిధి నుండి ఆరోగ్యశ్రీకి వర్తించని రోగులకు ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి ఎస్.రామచంద్రారెడ్డికి నివాళి

పెనుకొండ : మాజీ మంత్రి ఎస్.రామచంద్రారెడ్డి వర్ధంతి వేడుకలను శనివారం మండలంలోని కొండంపల్లి ఘాట్ వద్ద నిర్వహించారు. రామచంద్రారెడ్డి కుమార్తె, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రామచంద్రారెడ్డి ఘాట్‌కు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. పట్టణంలోని సవితమ్మ కార్యాలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు రామచంద్రరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పాఠశాలలో అన్నదానం

పరిగి : మండలంలోని కోడిగెనహళ్లి అంధుల పాఠశాలలో మాజీ మంత్రి రామచంద్రరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని సవితమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంధుల పాఠశాలలోని విద్యార్థులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తన తండ్రి మంత్రిగా ఉన్న సమయంలో ప్రజల కోసం ఎన్నో సహాయక కార్యక్రమాలు నిర్వహించారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుతున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఆలయంలో ఉన్న భక్తులు

ఖాద్రీనారసింహుని సన్నిధిలో భక్తుల రద్దీ

కదిరి టౌన్ : కదిరి నారసింహుని క్షేత్రంలో శనివారం నాడు భక్తుల రద్దీ నెలకొంది. కార్తీక మాసం, రెండవ శనివారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. జిల్లా నుంచే కాకుండా, కర్నాటక నుంచి భక్తులు విచ్చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

కళ్యాణోత్సవంలో పాల్గొన్న 'కందికుంట' దంపతులు

కళ్యాణోత్సవంలో పాల్గొన్న కందికుంట దంపతులు

కదిరి టౌన్ : కదిరి రూరల్ పంతలచెరువు పంచాయితీ ఇందుకూరుపల్లి గ్రామంలో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో కదిరి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకట ప్రసాద్, సతీమణి యశోద దేవిలు శనివారం పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఉత్తన్న, వైసీ వెంకటరెడ్డి, రమణారెడ్డి, కుమార్, నాగార్జున, మహేష్, అంజినేయులు, ట్రైలర్ రమణ పాల్గొన్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

పరిగిలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పరిగి : మండలంలోని సేవామందిర్‌లో కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పరిగి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈశ్వరప్ప ఆధ్వర్యంలో పరిగి మండల కేంద్రంలోని చెందిన మూడు కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీలోకి కండువా వేసి ఆహ్వానించారు. సోమవారం మధ్యాహ్నం మండల నాయకులు కార్యకర్తల సమావేశాన్ని సేవమందిర్ కేంద్రంగా నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కొత్తచెరువు : మండల కేంద్రంలోని పాత ఆంధ్ర బ్యాంకు వద్ద కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ 78వ జన్మదిన వేడుకలను ఆ పార్టీ మండల కన్వీనర్ బెల్లం నజీర్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో భవిష్యత్తులో కాంగ్రెస్ పుంజుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, మారాల ఓబులేసు, వజీర్, మోహన్, ముస్తఫా, సుభాన్ పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ దేశానికి విశిష్టమైన సేవలు చేసి దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రంగన అశ్వర్థ నారాయణ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోనియా గాంధీ 78వ జన్మదిన వేడుకలను నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ 78వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఆ పార్టీ నాయకులు శాన్వాస్, మణికుమార్, కదిరి పట్టణ అధ్యక్షుడు అస్రాఫ్, నాగభూషణం అధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

నేడు బత్తలపల్లిలో పిరమిడ్ ధ్యాన మందిరం ప్రారంభం

బత్తలపల్లి : మండల కేంద్రం పాతూరులో నూతనంగా నిర్మించిన పిరమిడ్ ధ్యాన మందిరంను బ్రహ్మర్షి గోపాల్‌రెడ్డి చేతులు మీదుగా ఆదివారం ప్రారంభిస్తున్నట్లు హరిహర ధ్యాన కేంద్రం కమిటీ సభ్యులు మదనాపు కొండన్న, గోపాల్, నాగేంద్ర తెలిపారు. ఆదివారం ఉదయం 10.30కు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు నుంచి శాఖాహార ర్యాలీతో ధ్యాన మందిరంకు చేరుకుంటామన్నారు. అక్కడ మందిరాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.

కనకదాసు జయంతి వేడుకలు

రొద్దం : మండలంలోని వివిధ గ్రామాల్లో భక్తకనకదాసు జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. బీదానిపల్లి, చిన్నకోడిపల్లి, నారనాగేపల్లి గ్రామాల్లో వేడుకలను నిర్వహించారు. పెనుకొండ నియోజకవర్గంలోని కురుబ నాయకులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. బీదానిపల్లి గ్రామంలో నాయకులకు సర్పంచి మంజునాథ్ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. సత్యసాయి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బికె.పార్థసారథి, కుమారుడు సాయి కళ్యాణ్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

నేడు టిడిపి ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ

ఓబులదేవరచెరువు : తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నాడు భారీగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ జయచంద్ర తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మద్దకవారిపల్లి గ్రామంలో వైసీపీ నుంచి టిడిపిలోకి పలువురు నాయకులు, కార్యకర్తలు ఆదివారం నాడు చేరుతున్న సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండల టిడిపి కార్యాలయంలో ఉదయం 10గంటలకు బైక్ ర్యాలీని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. మండల కేంద్రం నుంచి మద్దికవారిపల్లి వరకు బైక్ ర్యాలీ సాగుతుందన్నారు. అనంతరం అక్కడ జరిగే బహిరంగ సభలో వైసీపీ నాయకులు టిడిపిలో చేరుతారని చెప్పారు.

అందరికీ ఓటు హక్కు

ధర్మవరం టౌన్ : అర్హత గల వారందరికీ ఓటు హక్కును తప్పనిసరిగా కల్పిస్తామని తహశీల్దార్ యుగేశ్వరీదేవి తెలిపారు. ఈ సందర్భంగా వారు చివరి గడువు శనివారం ఉండటంతో ఓటు జాబితాలో ఉన్నటువంటి వాటిని వారు పరిశీలించారు. అనంతరం ఎన్నికల అధికారులు, సిబ్బందికి పలు సూచనలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ శనివారం చివరి రోజు కావడంతో ఆన్లైన్ ద్వారా నియోజకవర్గంలో ఫారం-6 లో 381 దరఖాస్తులు, ఫారం-7 లో 616, ఫారం-8 లో 201 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటన్నింటిని ఏడు రోజులు లోపల విచారణ జరిపి అందరికీ న్యాయం చేస్తామని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును పొందాలని, తదుపరి ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని మంచి నాయకున్ని ఎన్నుకోవాలని తెలిపారు.

రాజీమార్గమే రాజమార్గం

ధర్మవరం టౌన్ : రాజీమార్గమే రాజమార్గమని సీనియర్ సివిల్ జడ్జ్ గీతావాణి, జూనియర్ సివిల్ జడ్జి శివపార్వతి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ రమ్య సాయి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని మూడు కోర్టులలో జాతీయ మెగా లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని జిల్లా జడ్జి ఆదేశాల మేరకు నిర్వహించారు. అనంతరం జడ్జిలు మాట్లాడుతూ జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లోక్‌అదాలత్‌లో అన్ని వర్గాల వారికీ న్యాయం చేయడమే మా లక్ష్యం అన్నారు. లోక్‌అదాలతో ఇచ్చే తీర్పు తుది తీర్పు అవుతుందని తెలిపారు. అనంతరం జాతీయ మెగా లోక్ అదాలత్ 332 కేసులు పరిష్కారం చేశారు. ఈ కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ కమిటీ వారు తోపాటు సీనియర్, జూనియర్, న్యాయవాదులు, కోర్టు పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ల ఎంపిక

ఎన్నికైన వారిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రొద్దం : ఏపీటీఎఫ్ రాష్ట్ర నూతన కౌన్సిలర్లుగా మండల ఉపాధ్యాయులు ఎంపిక అయ్యారు. జిల్లా ఆడిట్ సభ్యునిగా మల్లికార్జున, కన్వీనర్‌గా చంద్రశేఖర్ గౌడ్ ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తామని తెలిపారు. ఎంపికైన వారికి ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.